క్లుప్తంగా

కూలేవరకూ.. కునికిపాటేనా?



పడిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

చిట్వేలి : విద్యుత్ స్తంభం కూలేవరకు పట్టించుకోరా అంటూ సి.కందులవారిపల్లి సర్పంచ్ యామాల శ్రీదేవి అధికారులను ప్రశ్నించారు. ఈ విషయమై గురువారం ఆమె మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఇప్పటికే కొన్ని పడిపోగా మరికొన్ని పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని, ఈ స్థితిలో కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లాలంటే భయపడుతున్నారన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా స్పందనలేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆమె సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

వైస్ ఎంపీపీ-1గా యదుభూషన్‌రెడ్డి

గాలివీడు : మండల వైస్ ఎంపీపీ-1గా యదుభూషన్‌రెడ్డిని గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి బాలమునెయ్య అధికారంగా ప్రకటించారు. సభా భవనంలో ఎన్నికల అధికారి ఎంపీటీసీల సమక్షంలో ఉపాధ్యక్షుడి ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఎంపీపీ జల్లా పద్మావత్మ ఆధ్వర్యంలో ఎంపీటీసీలు ఎంపీపీ-2గా ఉన్న యదుభూషన్‌రెడ్డిని ఎంపీపీ-1గా ఎన్నుకొన్నారు.

నేడు బీవీఎన్‌లో వైద్య శిబిరం

రాజంపేట రూరల్ : వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీర్ సయ్యద్ అబ్దుల్ రెహమాన్ జ్ఞాపకార్థం శుక్రవారం పట్టణంలోని బీవీఎన్ హైస్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ ఫస్ట్ రీజియన్ కౌన్సిలర్ కొండూరు శరత్‌కుమార్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో తిరుపతి ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, వాసన్ ఐకేర్ నుంచి ఈసీజీ, గుండె, కన్ను, చెవి, ముక్కు, గొంతు, కొలస్ట్రాల్ బీపీ, షుగర్ వ్యాధుల వైద్య నిపుణులు విచ్చేయనున్నట్లు తెలియజేశారు.

అరెస్టు అప్రజాస్వామికం

రాయచోటి అర్బన్ : పెండింగ్ వేతనాలను చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్న సీఐటీయూ నేతలను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణ, జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మిలు అన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె రూరల్ పరిధిలోని పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికై ముందస్తుగా నోటీసు ఇచ్చి శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిని అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో సిఐటియు జిల్లాకమిటీ సభ్యులు ఫయాజ్,విజయమ్మలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఒంటిమిట్ట: మండల పరిధిలోని చింతరాజుపల్లి పంచాయతీ బోయపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరాలపై గురువారం పోలీసులు దాడులు చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఒంటిమిట్ట మండల ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. తమకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో మండల పరిధిలోని బోయపల్లి గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున పేకాట ఆడుతున్న స్థావరాలపై సిబ్బంది కలిసి దాడులు చేయగా పేకాట ఆడుతున్న వారిలో ఆరుగురిని అదుపులోకి తీసుకోని, వారి వద్ద నుంచి రూ. 10,200 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారంతా పత్రపల్లె గ్రామానికి చెందినవారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఆర్‌బీకేలలో తనిఖీలు

రాజంపేట రూరల్ : కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మసూం బాషా మండల పరిధిలోని తాళ్లపాక, మదనగోపాలపురంలలోని రైతు భరోసా కేంద్రాలను(ఆర్‌బీకే) గురువారం తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌బీకేలలో రైతులకు వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలను తెలిపే కియోస్కలతోపాటు ప్రభుత్వం సరఫరా చేసే పరికరాలు, గోదాంలను పరిశీలించారు. రైతులకు సరఫరా చేసే విత్తనాలను, ఎరువులను తనిఖీ చేశారు.

'సమస్యలు చెప్పండి.. పరిష్కరిస్తాం'



సమస్యలను తెలుసుకొంటున్న అధికారులు

వీరబల్లె (రాయచోటి టౌన్) : మీ సమస్యలు మాకు చెప్పండి.. మేము పరిష్కరిస్తామంటూ ఎంపీడీఓ మల్లీశ్వరి ప్రజలకు తెలియజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం వీరబల్లె మండల కేంద్రంలోని పలు వీధులలో అధికారులు పర్యటించారు. ప్రజల ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధిలైట్లు, మురుగునీటి కాల్వలలో పూడికను తొలగించేలా చర్యలు తీసుకొన్నారు.

చరిత్రలో ఎన్నడూ చూడని సంక్షేమం

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- అర్హత ఉంటే ఇళ్ల ముంగిటకే సంక్షేమం
- గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



లబ్ధిదారుకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



నూతన పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మి

సంబేపల్లె : చరిత్రలో ఎన్నడూ చూడని సంక్షేమం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చూస్తున్నామని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ ఉదయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని దళితవాడ, మొటుకువాండ్లపల్లె, బండకాడపల్లె దళితవాడ, బండకాడపల్లె, వంకవారి దళితవాడ, నాగిరెడ్డిగారిపల్లె, ఇరగనేనివాండ్లపల్లె, కంబెళ్లవాండ్లపల్లె, అన్నప్పగారిపల్లె, గోరావాండ్లపల్లె, పోతువాండ్లపల్లెలలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి గడప గడపకు కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి గడపకు శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి సమస్యలను ఆరా తీస్తూ సంక్షేమ, అభివృద్ధి పథకాలను తెలియజేశారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి దేశంలోనే ఆదర్శ సీఎంగా జగన్ నిలుస్తారన్నారు. ఎస్సీల పక్షాన జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. ఏకిల కులస్తులను బీసీల్లో చేర్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌దేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరం రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, ఆవుల మల్లికార్జునరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథరెడ్డి, మాజీ సర్పంచ్ నాగారంజన్‌వలి, జేసీఎస్ కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తహసీల్దార్ మహేశ్వరిభాయ్, ఎంపీడీఓ నరసింహులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లె గ్రామంలోని పోతువాండ్లపల్లెలో ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ ఉదయకుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలి



పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న మోహన్‌రెడ్డి

రామాపురం : ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలని అప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేట దర్బారు సాయి మందిరంలో ఆ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. దర్గాలోని సాయి మందిర్, దర్గా స్వామిజీ మాతాజీ సమాధుల వద్ద పూజల్లో పాల్గొన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు సీఎఫ్ అబ్దుల్ హుస్సేన్‌ను మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల అనారోగ్య పరిస్థితుల కారణంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సమాచారం తెలుసుకున్న ఆయన ఇంటికి వెళ్లి పమార్శించారు.

విత్తనశుద్ధితో దిగుబడి ఆశాజనకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గాలివీడు : వేరుశనగలో విత్తనశుద్ధితో ఆశాజనకంగా దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి మురళీధర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గోపనపల్లె గ్రామంలో రైతులకు పొలంబడిపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారి మాట్లాడుతూ వేరుశనగ పంటలో సాగు బడి ఖర్చులు తగ్గించి దిగుబడి పెంచడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమన్నారు. అందులో భాగంగా విత్తనశుద్ధిలో పాటించాల్సిన మెళకువలు, కంచెపంట, ఎర పంటలు, పక్షి స్థావరాలు, మిత్రపురుగుల, సంరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే ఖరీఫ్‌లో పంటసాగు, పురుగుల మందుల వాడకం వలన రైతులకు కలిగే ఆరోగ్య సమస్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, వీఏఏలు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో వలంటీర్ల నిరసన



వలంటీర్లతోపాటు నిరసన తెలుపుతున్న సర్పంచ్

పెనగలూరు : మండలంలోని సిద్దవరం సచివాలయంలో వలంటీర్లు నల్లబ్యాడ్జీలు ధరించి జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరయ్యారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన అసత్య ఆరోపణలను ఖండించారు. అనంతరం నిరసన తెలిపారు. వలంటీర్లకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు సర్పంచ్ ప్రేమలతారెడ్డి తెలిపారు. వలంటీర్లతోపాటు సర్పంచ్ కూడా నిరసనలో పాల్గొన్నారు.

మండల కో-ఆప్షన్ సభ్యుడిగా గౌస్‌బాషా



రాజంపేట టౌన్ : మండల కో-ఆప్షన్ సభ్యుడిగా సయ్యద్ గౌస్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో మండల కో-ఆప్షన్ సభ్యుడిగా ఉన్న మస్తాన్ మృతి చెందడంతో కో-ఆప్షన్ పదవికి ఎన్నిక నిర్వహించాల్సి వచ్చింది. ఈనేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండల కో-ఆప్షన్ పదవికి ఉపాధి హామీ పథకం ఏపీడీ, ఎన్నికల అధికారి అయిన ప్రతాప్ ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికలో గౌస్‌బాషా ఒక్కరే కో-ఆప్షన్ పదవికి పోటీ పడ్డారు. దీంతో ఆయన అభ్యర్థిత్వాన్ని తాళ్లపాక ఎంపీటీసీ మధుసూదన్‌వర్మ ప్రతిపాదించడంతో ఊటుకూరు-2 ఎంపీటీసీ నాగచంద్రశేఖర్‌రెడ్డి బలపరిచారు. అనంతరం సభ్యుల మద్దతుతో గౌస్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌస్‌బాషాను ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ బాలమునుస్వామితోపాటు ఎంపీటీసీలు సత్కరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు అక్కి నాగరత్నమ్మ, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ బాల మునుస్వామి, వివిధ ప్రాంతాల మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రైల్వేకోడూరు : మండలంలో రూ.17 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డితో కలిసి గురువారం సాయంత్రం పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి పరిశీలించారు. రాఘవరాజుపురం నుంచి బొజ్జవారిపల్లె వయా సారమానుపోడు వరకు రోడ్డు పనులు, అలాగే రాజీవ్ గాంధీ గిరిజన కాలనీ నుంచి పిల్లగుట్ట ఎస్టీ కాలనీ వయా సత్యనారాయణపురం చంచమ్మ ఎస్టీ కాలనీ, చిట్వేలి రోడ్డు సింగిరివారిపల్లె, కొత్తపల్లె దళితవాడ వరకు జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

సాంకేతికతతో విద్యను బోధించండి



మాట్లాడుతున్న డైట్ వైస్ ప్రిన్సిపల్ శివభాస్కర్

రాయచోటి టౌన్ : విద్యార్థులకు సాంకేతికతను జోడించి విద్యను బోధించాలని డైట్ వైస్ ప్రిన్సిపల్ శివభాస్కర్ చెప్పారు. డైట్ కేంద్రంలో మ్యాజిక్ బస్, ఎస్‌సీఈఆర్‌టీ వారి ఆధ్వర్యంలో పీఈటీ, పీడీలకు గురువారం నుంచి మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు జీవన వైవిధ్యంపై అవగాహన కల్పించేందుకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతికతో పాటు నైపుణ్యం జోడించి విద్యార్థులకు విజ్ఞానాన్ని నేర్పాలని చెప్పారు. కార్యక్రమానికి మానిటరింగ్ అధికారిగా డీఈఓ శ్రీరాం పురుషోత్తం వ్యవహరించారు. పీఈటీ టీచర్ల సంఘం నాయకులు రమేష్ బాబు, వీరాంజనేయులు, రెడ్డయ్య, వెంకటరాజు, జగదీశ్వరయ్య, లలితమ్మ, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించండి

గాలివీడు : సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలని ఎంపీపీ జల్లా పద్మావతమ్మ మండల, గ్రామ స్థాయి అధికారులను కోరారు. గురువారం ఎంపీపీ చాంబర్‌లో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులకు అందించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. అనంతరం మండలంలో అసైన్డ్‌మెంట్ భూ పంపిణీ సంబంధిత అధికారులు లబ్ధిదారులకు భూ పట్టాదారు పాసుపుస్తకాలను అందించాలన్నారు. గ్రామ, మండల స్థాయి అధికారులు ఎక్కడైన ప్రజల సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

సంక్షేమం అందించడమే 'జగనన్న సురక్ష' లక్ష్యం

- అర్హులకు ధృవీకరణ పత్రాలు అందజేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు



పెనగలూరు: సర్టిఫికెట్లు అందిస్తున్న అజయ్ రెడ్డి

పెనగలూరు : దారిద్ర్య రేఖకు దిగువనున్న వారిని అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి అన్నారు. గురువారం సిద్దవరం, సింగారెడ్డిపల్లి పంచాయతీలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ముఖ్యంగా వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికంగా ఉన్నాయని, అటువంటి వ్యవస్థను కొంతమంది విమర్శించడం తగదన్నారు. విమర్శించిన వారు తక్షణమే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలన్నారు. పద్మాయగారిపల్లెకు చెందిన మహిళలు డీలర్‌షిప్ దూరంగా ఉన్నందున బియ్యం కోసం రూ. 50లు ఆటోలకు ఖర్చు పెడుతున్నామన్నారు. స్పందించిన అజయ్ రెడ్డి సిద్దవరం సర్పంచ్ ప్రేమలత రెడ్డితో చర్చించి ప్రతినెల పద్మాయగారిపల్లికి ట్రాక్టర్‌లో తీసుకువెళ్లేలా మాట్లాడారు. ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ శ్రీధర్ రావు, సింగారెడ్డిపల్లి సర్పంచ్ ఎల్లమ్మ, సిద్దవరం శ్రీనివాసులు రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జి.శివకుమార్, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, ఎంపీటీసీ లింగం చంద్రకళలతోపాటు అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం

లక్కిరెడ్డిపల్లె : పేద ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వ లక్ష్యమని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సయ్యద్ అమీర్, రవిరాజు, విజయభాస్కర్, వార్డు మెంబర్ సైమన్, నరసింహారెడ్డి, తహసీల్దార్ ఉదయ శంకర్ రాజు, ఈఓపీఆర్‌డీ పట్నాయక్, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ జనార్దన్ రెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మినారాయణ, దస్తగిరి, శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

రాయచోటి అర్బన్ : ప్రజల సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా అన్నారు. గురువారం పట్టణంలోని తోగటవీధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఫయాజ్ బాషా మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధృవీకరణ పత్రాల కోసం జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకుని అదేరోజు ధృవపత్రం తీసుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించడం శుభ పరిణామం అన్నారు. అనంతరం ప్రజలకు మంజూరైన ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కమిషనర్ గంగాప్రసాద్, కౌన్సిలర్ జానం రాధ, కో - ఆప్షన్‌సభ్యుడు ఆసిఫ్ అలీఖాన్, వైఎస్ఆర్‌సిపి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఏపీటీడీసీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి తెలియజేశారు. గురువారం మధ్యాహ్నం ఓబులవారిపల్లి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం 340 లబ్దిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ విజయారావు, సర్పంచ్ జైపాల్ రెడ్డి, ఎంపీటీసీ కాగితాల సుజాత, ఉపసర్పంచ్ ఉమా దేవి, సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి, ఎంపీటీసీ గోగడ్డ దుర్గాప్రసాద్, ఎంపీటీసీ నరసింహులు, ఏపీఎం ఆర్ముగం, ఏఓ మల్లిక, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తిప్పాయిపల్లిలో..

పుల్లంపేట : మండల పరిధిలోని తిప్పాయిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డిలు హాజరయ్యారు. అనంతరం అర్హులైన వారికి ధృవీకరణ పత్రాలు అందించారు. తహసీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ రఘురాం, డీటీ ప్రసన్న కుమారి, ఆర్ఐ నవీన్, విద్యుత్ ఏఈ కుమార్, సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచ్ కేశవరెడ్డి, ఉపసర్పంచ్ తోట మహేంద్రరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం
– మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేట, హసనాపురం గ్రామంలోని పప్పిరెడ్డిగారిపల్లె సచివాలయంల పరిధిలో గురువారం ఆ గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. నీలకంఠ్రావుపేటలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై లబ్దిదారులకు ధృవపత్రాలను అందజేశారు. మండల ప్రత్యేకాధికారులు సుస్మిత, తహసీల్దార్ అరవింద్ కిషోర్, ఎంపీడీఓ హైదర్‌వలి, ఈఓపీఆర్‌డీ ఉషారాణి, ఏపీఎం దేవసేన, సర్పంచ్ ఆంజనేయులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: ధృవీకరణ పత్రాలు అందిస్తున్న దృశ్యం



రాయచోటిలో మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో..



కుటుంబ సభ్యుడిలా సేవలు..



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి రాజంపేట పట్టణంలో వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. 2021వ సంవత్సరం నవంబర్‌లో సంభవించిన వరదల్లో వీరూ తమ పరిధిలోని కుటుంబాలకు ఆహార పొట్లాలను తీసుకెళుతున్న దృశ్యం. భారీ వరదల కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో అనేక గ్రామాలు నీటమునిగాయి. దీంతో రాకపోకలు ఒక రోజంతా స్తంభించిపోయాయి. అనంతరం అతికష్టం మీద అధికారులు రాజంపేట పట్టణం నుంచి ఆహార పదార్థాలను, నీళ్ల బాటిళ్లతో గ్రామాలకు చేరుకున్నారు. అధికారులు తీసుకొచ్చిన ఆహార పదార్థాలను, నీళ్ల బాటిళ్లను వలంటీర్లు అతికష్టం మీద ఇంటింటికి వెళ్లి ఇవ్వగలిగారు. యాభై ఇళ్లకు ఒక వలంటీరు ఉండబట్టే ఆ విపత్కర సమయంలో వరద ప్రాంతాల్లోని ప్రజలకు ఆహార పదార్థాలు చేరాయి. లేకుంటే అనేక మంది ఆహారం, నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. 2021 నాటి వరద పరిస్థితులను తలుచుకుంటే అనేక గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతారు. అలాంటి పరిస్థితుల్లో వలంటీర్లు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించారు. – రాజంపేట టౌన్

ఆ బిడ్డలు లేకుంటే బువ్వ కూడా లేదు నాయనా



అన్నమయ్య డాం తెగిపోయినప్పుడు కట్టుబట్టలతో మిగిలాం బిడ్డా. దాదాపు ఒకరోజంతా పస్తున్నాం. యాడ చూసినా నీళ్లే. మేము యాడికి పోలేము, మాకాడికి ఎవరు రాలేరు. ఏం చేద్దాం. ఆరోజు పరిస్థితి అట్టుండే. అయితే మరుసటిరోజు రాజంపేట నుంచి అధికారులు గ్రామం వరకు బువ్వ పొట్లాలు తెచ్చినారు. ఆ పొట్లాలను పాపం వలంటీరు బిడ్డలు మా ఇళ్ల కాడికి తెచ్చి ఇచ్చారు. అట్ట నాలుగైదు రోజులు అధికారులు, వలంటీర్లు మాకు ఇచ్చేవారు. ఆ రోజుల్లో వలంటీర్లు మాకు చేసిన మేలు ఎప్పటికి మరచిపోలేమయ్యా. – సుబ్బమ్మ, మందపల్లె దళితవాడ, రాజంపేట మండలం

పింఛన్ కోసం మైళ్లు వెళ్లి..



ఈ చిత్రంలో వృద్ధుడికి వైఎస్సార్ పింఛన్ కానుకను వలంటీర్ దీప్తి అందజేస్తోంది. తన క్లస్టర్ పరిధిలోని నాగసత్యప్రసాద్ అనే పింఛన్‌దారుడు అనారోగ్యంతో మదనపల్లెలో చికిత్స పొందుతున్నాడన్న సమాచారంతో వలంటీర్ మదనపల్లె ఆసుపత్రికి వెళ్లి తన బాధ్యతను నిరూపించింది. ముఖ్యమంత్రి ఏ సంకల్పంతో అయితే వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారో అందుకు నిదర్శనం దీప్తి. తన పరిధిలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమంతోపాటు కావాల్సిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు వారికి తెలియజేస్తూ వారికి సేవలను అందిస్తోంది. – చిన్నమండెం

కష్టకాలంలో ఆదుకుంది



నాకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మదనపల్లెలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాను. నాకు వైద్య ఖర్చులకు డబ్బులు అవసరమయ్యాయి. ఇంతలోనే మా వలంటీర్ కీర్తి మదనపల్లెలోని ఆసుపత్రికి వచ్చి బయోమెట్రిక్ వేయించుకొని పింఛన్ డబ్బులను అందజేసింది. దీంతో ఆ సమయంలో మా వలంటీర్ కీర్తి నాకు దేవుడి రూపంగా కనిపించింది. సీఎం జగనన్న అడుగుజాడల్లో నడుస్తున్న వలంటీర్లకు నా వందనాలు. – ఎస్.నాగసత్యప్రసాద్, చిన్నమండెం, అన్నమయ్య జిల్లా

సకాలంలో జీతాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయులకు సకాలంలో జీతభత్యాలు చెల్లించాలని, ప్రభుత్వ సిఫారసు పేరుతో చేస్తున్న అక్రమ బదిలీలను తక్షణమే నిలుపుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్ జాబీర్‌లు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు గురువారం సాయంత్రం అన్నమయ్య జిల్లా డీఈఓ కార్యాలయం ఎదుట వారు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ సాధారణ బదిలీలకు వేలాది మంది దరఖాస్తు చేసుకోగా, రాష్ట్ర వ్యాప్తంగా 52వేల మందికి బదిలీలు జరిగాయన్నారు. బదిలీల్లో కేటాయించిన స్థానంలో పోస్టు ఖాళీ లేకపోవడం, సాంకేతికత, ప్రభుత్వ వైఫల్యాలు తదితరాల కారణంగా ఇప్పటికీ చాలామంది ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇవ్వలేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించని పక్షంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఎదుట ధర్నా చేపడతామంటూ వారు హెచ్చరించారు.

వైభవంగా సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం



సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవ దృశ్యం

చిట్వేలి : కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకొని స్థానిక అమ్మవారిశాలలో సోమేశ్వర ఆలయంలో సుబ్రమణ్యస్వామికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు గురువారం ఉదయం అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిశాలలో సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం సుబ్రమణ్యస్వామి వారికి మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.